క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమించే స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



డీఈఓ కె.శ్యామూల్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కర్నూలు సిటీ: ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి వేసవి సెలవుల్లో అడ్మిషన్లు చేపట్టే ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సోమవారం డీఈఓ శ్యామూల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ కార్పొరేట్, సెమి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పెద్ద ఎత్తున హోర్డింగ్‌లను ఏర్పాటు చేసి ఆయా స్కూళ్లలో పని చేసే టీచర్లతో క్యాంపెయినింగ్ చేయిస్తూ అడ్మిషన్లు చేయిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేంత వరకు ఎలాంటి అడ్మిషన్లు చేయకూడదన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, నగర కార్యదర్శి సాయి ఉదయ్, జిల్లా కమిటీ సభ్యులు గౌస్, తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం ఆదర్శం



సుందరయ్య చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): సమ సమాజ స్వాప్నికుడు సుందరయ్య జీవితం ఆదర్శమని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు నరసింహులు అన్నారు. సోమవారం నగరంలోని 23వ వార్డు పరిధిలోని శ్రీరామనగర్‌లో సుందరయ్య 39వ వర్ధంతి సభను నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సుందరయ్య ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లాలన్నారు. ఎక్కడైతే అన్యాయం జరుగుతుందో అక్కడే పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ శేషంరాజు, ఈశ్వర్య్య, వెంకటరమణ, జి.రత్నం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మండలం బి.తాండపాడులో అగ్ని ప్రమాదంలో పశు గ్రాసం దగ్ధమైన బాధిత రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘంజిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం బాధిత రైతులతో కలసి ఆయన డీఆర్వో కె.మధుసూదన్‌రావుకు వినితిపత్రం సమర్పించారు. గ్రామానికి చెందిన పెద్ద బజారి, టీకే శేషన్న, చిన్న బజారి, వేణుగోపాల్, పులేందర్, కె.ధర్మయ్య, టి.శ్రీనివాసుల చొప్ప వాములు ఏప్రిల్ నెలలో అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో ఒక్కో రైతుకు దాదాపు రూ.40 వేల నష్టం వాటిల్లడంతోపాటు పశువులుకు గ్రాసం కొరత నెలకొందన్నారు. ఈక్రమంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని ఆయన కోరారు. వారి వెంట సర్పంచ్ బాల పీర ఉన్నారు.

యోగా సాధనతో ఒత్తిడి దూరం



వేసవి శిక్షణ శిబిరంలో యోగా సాధన చేస్తున్న చిన్నారులు

కర్నూలు (టౌన్): క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడిని దూరం చేయవచ్చని రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో వేసవి యోగా శిక్షణ కేంద్రం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులు యోగాను అభ్యసించాలన్నారు. నిత్యం ఒత్తిడికి గురయ్యే సమాజంలో యోగా ద్వారా ఎంతో ఉపశమనం లభిస్తుందన్నారు. యోగా సాధన వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. అనంతరం వేసవి శిక్షణ శిబిరానికి వచ్చిన చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు.

22న నృసింహ చతుర్దశి మహోత్సవం

కర్నూలు కల్చరల్: ఇస్కార్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ పూరీ జగన్నాథ మందిరంలో ఈనెల 22వ తేదీన నృసింహ చతుర్దశి మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు తెలిపారు. జగన్నాథ స్వామికి నృసింహ స్వామి అలంకారం, హరినామం, నృసింహ జప యజ్ఞం, హరినామ సంకీర్తన, చప్పన్ భోగ (56 రకాల ఆహార పదార్థాల నివేదన), నృసింహ లీలా ప్రవచనం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు అందరూ పాల్గొన వచ్చని విజ్ఞప్తి చేశారు.

సంతోషంగా విహరిద్దాం..!

- సెలవుల్లో విహార యాత్రలకు వెళ్తున్నారా..
- పర్యాటక ప్రాంతాల పర్యటనలకు ప్రణాళికలు తప్పనిసరి
- చిన్నపాటి జాగ్రత్తలతో యాత్రలు విజయవంతం
- గుర్తింపు కార్డులు, మెడికల్ కిట్లు వెంట తీసుకెళ్లితే మంచిది
- చిన్నారుల జేబుల్లో చిరునామా స్లిప్పులు తప్పక ఉంచాలి
- ప్రమాదకర ప్రాంతాల్లో సెల్ఫీల జోలికెళ్లొద్దు

వేసవి సెలవుల్లో విహార యాత్రలకు వెళ్లడం సాధారణంగా మారింది. కొందరు కుటుంబ సభ్యులు మాత్రమే వెళ్తుంటారు.. మరికొందరు బంధు మిత్రులతో బృందాలుగా ఏర్పడి ప్యాకేజీలు మాట్లాడుకొని సంతోషంగా గడపడానికి వెళ్తుంటారు. ఉరుకుల పరుగులతో కూడిన యాంత్రిక జీవితానికి సెలవుల్లో కాసింత ఉపశమనం పొందడానికి ప్లాన్ చేసుకుంటుంటారు. సెలవుల్లో సేద తీరడంతో పాటు కొత్త ప్రాంతాలను సందర్శించామనే తృప్తి కలుగుతుంది. సొంత గ్రామాలకు.. బంధువుల ఊర్లకు వెళ్లడం.. పర్యాటక ప్రాంతాలను సందర్శించడం లాంటివి చేస్తుంటారు. విహార యాత్రల్లో ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు లేకుండా.. విజయవంతం కావాలంటే తగిన ప్రణాళికలు రూపొందించుకొని వాటిని అనుసరించడం చాలా అవసరం. యాత్రకు వెళ్లిన వారందరూ వారివారి పరిధిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే యాత్ర ఆనందాల హారంగా మారుతుంది.

– కర్నూలు కల్చరల్

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. శ్రీశైలం, రోళ్లపాడు అభయారణ్యం, మంత్రాలయం, యాగంటి, అహోబిలం, ఓంకారం, ఓర్వకల్ రాక్ గార్డెన్స్, బెలుం గుహలు, కొలనుభారతి సరస్వతి ఆలయం, బనగానపల్లె నవాబ్ కోట, మహానంది, ఆదోని కోట, సంగమేశ్వరం, ఓంకారం, కాల్వబుగ్గ, కేతవరం, వాల్మీకి కేవ్స్, బిల్వసర్గ, కర్నూలు నగర వనం, జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించవచ్చు. ఇక తెలుగు రాష్ట్రాల్లో అయితే రాజమండ్రి పాపికొండలు, నాగార్జున సాగర్ డ్యామ్, వేములవాడ, భద్రాచలం, కోటి లింగాల, సోమసిల్ల, యాదగిరి గుట్ట, అరకులోయ, రుషికొండ, భీమిలి బీచ్, బొర్రాగుహలు, అన్నవరం, ద్రాక్షారామం, విజయవాడ కనక దుర్గ ఆలయం, అనంతపురం లేపాక్షి, పుట్టపర్తి, కోటప్పకొండ, మైపాడ్ బీచ్, బారా షాహిద్ దర్గా, వేలూరు గోల్డెన్ టెంపుల్,ముచ్చింతల్, హైదరాబాద్ బిర్లాటెంపుల్, నెహ్రూ జులాజికల్ పార్క్, ట్యాంక్ బండ్, ముచ్చింతల్ సమతా మూర్తి మందిరం యాత్రికులకు స్వాగతం పలుకుతున్నాయి. వేసవి సెలవుల నేపథ్యంలో చాలా మంది సందర్శనీయ స్థలాలను చూసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

సన్నద్ధత ముఖ్యం...

- విహార యాత్రలకు వెళ్లేటప్పుడు ఉత్సాహం ఎంత అవసరమో జాగ్రత్త కూడా అంతే అవసరం.
- యాత్ర ప్రదేశాలకు సంబంధించిన పూర్తి వివరాలు ముందే తెలుసుకొని సమయం సద్వినియోగం అయ్యేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.
- వెంట ఫొటో, చిరునామాలతో కూడిన గుర్తింపు కార్డులు తీసుకెళ్లడం మంచిది. ఆపత్కాలంలో వీటి అవసరం పడుతుంది.
- స్మార్ట్ ఫోన్లు ఉంటే అందులో నేవిగేషన్ యాప్ ద్వారా మనం వెళ్లే ప్రాంతాలకు దారిని తెలుసుకోవచ్చు. తెలియని ప్రాంతాల మార్గాలను కూడా సులభంగా తెలుసుకోవచ్చు..
- కచ్చితంగా ప్రథమ చికిత్సకు సంబంధించిన వైద్య సామగ్రి వెంట తీసుకెళ్లాలి. జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులకు సంబంధించిన మాత్రలను వెంట బెట్టుకుని వెళ్లాలి.
- విహారయాత్ర ఎన్ని రోజులు ఉంటుందో ముందే తెలుస్తుంది కాబట్టి అన్ని రోజులకు సరిపడా దుస్తులు తీసుకెళ్లాలి.
- పర్యాటక ప్రాంతాలను సందర్శించినప్పుడు వాటి చరిత్రను, అక్కడి విశేషాలను, మధురానుభూతులను డైరీలో రాసుకుంటే అవి జీవితాంతం గుర్తుండి పోతాయి.
- విహార యాత్రకు వెళ్తున్నట్లయితే మనకు సంబంధించిన ముఖ్యమైన బంధువులు, స్నేహితులకు తెలియజేయాలి.
- చాలా రోజులు యాత్రకు వెళ్తున్నట్లయితే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వడం మంచిది.
- ఇంట్లో నగదు, పత్రాలు, బంగారు, వెండి ఇతర విలువైన వస్తువులు ఉంచి వెళ్లకుండా బంధువుల ఇంట్లోగాని, లాకర్‌లోగాని భద్ర పరుచుకోవాలి.
- భారీ మొత్తం బంగారం ఆభరణాలతో యాత్రలకు వెళ్లరాదు.
- పిల్లలతో అప్రమత్తంగా ఉండాలి. వారి మెడలో విలువైన ఆభరణాలు వేయరాదు. .
- సాధ్యమైనంత వరకు విలువైన వస్తువులు వెంట తీసుకోక పోవడం ఉత్తమం. తప్పని పరిస్థితిలో తీసుకెళ్లాల్సి వస్తే వాటికి బీమా చేయించడం మంచిది..



ముచ్చింతల్ సమతా మూర్తి మందిర్



శ్రీశైల దేవస్థానం

చిన్న చిన్న జాగ్రత్తలతోనే పర్యటన సుఖాంతం

- కుటుంబ సభ్యులందరితో పాటు విహార యాత్రకు వెళ్లినప్పుడు ఆ బృందంలో పిల్లలు కచ్చితంగా ఉంటారు. మనం వెళ్లిన ప్రాంతంలో రద్దీ అధికంగా ఉంటే పిల్లల బాధ్యతను ఒక్కొక్కరుగా పంచుకోవాలి.
- చిరునామా, సెల్ నెంబర్ వివరాలు ఉన్న చిన్న స్లిప్పులు పిల్లల జేబుల్లో కచ్చితంగా ఉంచాలి.
- ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకైతే కొంత పరిజ్ఞానం ఉంటుంది. వారికి మన సెల్ నెంబర్, చిరునామా తెలియజేయాలి. అంటే వారు ఒక వేళ ఆ ప్రాంతాల్లో తప్పి పోయినా వివరాలు చెప్పేలా ఉండాలి.
- ముఖ్యంగా నదులు, చెరువులు, కోనేర్లు ఉన్న దగ్గర పిల్లలు అప్రమత్తంగా ఉండాలి. ఇష్టానుసారం వదిలేయరాదు. ఎదైనా అనుకోని ఘటన జరిగితే జీవితాంతం బాధ పడాల్సిందే.
- నీటి పరివాహ ప్రాంతాలు, కొండలు, లోయలు లాంటి ప్రమాద కర ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలి. ఈత కొట్టడం, ఫొటోలు, సెల్ఫీలకు అత్యుత్సాహం ప్రదర్శించరాదు.
- ఆహార పదార్థాల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పళ్లు, పళ్ల రసాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.



మధురానుభూతి మిగలాలి



పర్యాటక స్థలాల సందర్శనతో వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు ప్రత్యక్షంగా చూడగలుగుతాం. చారిత్రక ప్రదేశాలు, కట్టడాలను చూడటం వల్ల సాంకేతిక పరిజ్ఞానం ఎలా పరిణతి చెందిందో తెలుస్తుంది. కుటుంబ సభ్యులు అందరూ కలిసి విహార యాత్రలు చేయడంతో మానసిక వికాసం, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుంది. క్రమశిక్షణను విస్మరిస్తే ఆపదలు కూడా పొంచి ఉంటాయనే విషయాన్ని గ్రహించాలి. విహార యాత్రకు బయలుదేరినప్పుడు ఎంత సంతోషంగా ఉంటారో తిరిగి వచ్చేటప్పుడు కూడా యాత్ర తీపి జ్ఞాపకాలతో అంతే సంతోషంగా మనం గమ్య స్థానం చేరుకోవాలి.

– డాక్టర్ మండి అన్వర్ హుసేన్, తెలుగు శాఖాధ్యక్షులు, ఉస్మానియా కళాశాల

ప్రత్యేక ప్యాకేజీలతో యాత్రలు



ఏడాదిలో నాలుగైదు ప్యాకేజీలతో టూర్ ఏర్పాటు చేస్తాం. సెలవుల్లో ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలకు ప్రత్యేకంగా ప్యాకేజీలతో టూర్స్ వేస్తుంటాం. రెండు మూడు ఫ్యామిలీలు కలిసి ట్రిప్స్ అడుగుతుంటారు. వారి అభిరుచుల మేరకు కోరుకున్న ప్రాంతాలకు, కోరుకున్న వాహనాలను ఏర్పాటు చేస్తుంటాం. యాత్రలకు వచ్చే వారు కోరున్న ఆహార పదార్థాలను తయారు చేసి ఇస్తాం. వెళ్లే ప్రాంతం, వాహనం, ఆహార పదార్థాలకు అనుగుణంగా టూర్ ప్యాకేజి ఉంటుంది. ముఖ్యంగా పుణ్యక్షేత్రాల పర్యటనకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తుంటారు.

– మురళి, టూర్ ఆర్గనైజర్

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

- డీఆర్వో కె.మధుసూధన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్): ఇంటర్, టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో కె.మధుసూదన్‌రావు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఇంటర్, పదో తరగతి అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 24వ తేదీ నుంచి ఇంటర్, జూన్ 1 నుంచి పదో తరగతి అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం 35 సెంటర్లు, రెండో సంవత్సరం విద్యార్థుల కోసం 22 సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి 5 సెంటర్లలో 930 హాజరు కానున్నట్లు చెప్పారు. కాగా, పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మంచినీటిని అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రాల్లోకి వెలుతురు వచ్చేలా చూసుకోవాలని, పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ బస్సులను నడపాలన్నారు. ప్రశ్న పత్రాలను పటిష్ట బందోబస్తు మధ్య కేంద్రాలకు తరలించడం, అక్కడి నుంచి జవాబుపత్రాల తరలింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఆర్ఐఓ గురవయ్యశెట్టి, డీవీఈఓ జమర్‌పాషా, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఫర్ స్కూల్స్ చంద్రకాంత్, డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు పరమేశ్వరరెడ్డి, లాలెప్ప పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం

కర్నూలు (టౌన్): నగరంలో అక్రమ నిర్మాణాలు ఉంటే చట్ట ప్రకారం త్వరలో చర్యలు తీసుకుంటామని నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాక్షి దినపత్రికలో 'ప్లానింగ్‌లో చేతివాటం' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై ఆమె స్పందించారు. నగరంలో చేపడుతున్న భవన, వాణిజ్య నిర్మాణాలకు అనుమతులు తీసుకున్న అనంతరం వాటిని అతిక్రమించి నిర్మించిన భవనాలకు నోటీసులు ఇచ్చామన్నారు. ఇప్పటికే నిబంధనలు విస్మరించిన వాటిని తొలగించామన్నారు. డివియేషన్‌తో పాటు అనుమతి లేకుండా అదనంగా ఫ్లోర్ వేయడం, అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టడం, అలాగే సెట్ బ్యాక్స్ లేకుండా చేపట్టిన భవనాలను త్వరలో గుర్తించి చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

దుండగుల దుశ్చర్య

- నూతనంగా వేసిన రోడ్డును ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు
- పట్టించుకోని పోలీసులు



రోడ్డును ధ్వంసం చేసిన దృశ్యాలు

మద్దికెర: నూతన రోడ్డును ధ్వంసం చేసి దుండగులు దుశ్చర్యకు పాల్పడ్డారు. రెండు నెలల క్రితం రూ.8.50 కోట్లు ఖర్చు చేసి మద్దికెర–మొలగవెల్లి రోడ్డును వేశారు. రైల్వే బ్రిడ్జి వద్ద రోడ్డుపై రెండు చోట్ల గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అటుగా వెళ్లిన వారు గమనించి ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రోడ్డును ధ్వంసం చేయడమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా విషయం తెలిసినా పోలీసులు అటువైపు తొక్కి చూడలేదు. ఇంతకు ముందు కూడా అభివృద్ధి పనుల శిలాఫలకాలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఆ విషయంలోనూ పోలీసులు నిందితులను గుర్తించడం కానీ, చర్యలు తీసుకోవడం కానీ చేయలేదు. అందుకే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. రోడ్డు ధ్వంసం ఘటనను ఎస్ఐ రమేష్‌బాబు దృష్టికి 'సాక్షి' తీసుకెళ్లగా బిజీగా ఉండటంతో అక్కడికి వెళ్లలేకపోయానని, రేపు ఉదయం వెళ్లి విచారిస్తానని చెప్పారు.

23న బండలాగుడు పోటీలు

కల్లూరు: మండల పరిధిలోని పందిపాడు గ్రామం శివన్న తోట వద్ద వెలసిన శ్రీ పూల శంకరయ్య 47వ ఆరాధన మహోత్సవం సందర్భంగా ఈ నెల 23న బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. పోటీల్లో విజేతలైన వారికి బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. గ్రామ పెద్దలు, పూల హనుమన్న బ్రదర్స్ ఆధ్వర్యంలో చెక్క భజన, నంది కోల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



గగన్‌దీప్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఏఐఎస్ఎఫ్ రాజస్థాన్ రాష్ట్ర అధ్యక్షుడు గగన్‌దీప్‌సింగ్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న డిమాండ్ చేశారు. సోమవారం సీఆర్ భవన్‌లో గగన్‌దీప్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గగన్‌దీప్ సింగ్‌ను ఈనెల 1వ తేదీన రాజస్థాన్‌లోని గంగానగర్‌లో కొందరు అనుమానాస్పద వ్యక్తులు హత్యాప్రయత్నం చేయగా, జైపూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 15వ తేదీన చనిపోయారన్నారు. ఈ క్రమంలో పోలీసులు ప్రమాదంగా కేసులను పరిగణించడంపై తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సి.అశోక్, నవనీత్, సూరి, దుర్గన్న, మహబూబ్‌బాష, షఫీ, వర్ధన్, తరుణ్ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌లో కంప్యూటర్ శిక్షణ

కర్నూలు కల్చరల్: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్, అలయన్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ కర్నూలు, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ చైర్ పర్సన్ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. 4 నుంచి 8 సంవత్సరాల లోపు చిన్నారులకు డ్రాయింగ్, కంప్యూటర్ బేసిక్స్, పేపర్ క్రాఫ్టింగ్, 9 నుంచి 15 సంవ్సరాల లోపు వారికి సర్టిఫికెట్ కోర్స్ ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్, తెలుగు డీటీపీ, 15 సంవత్సరాలు పైబడిన వారికి ఫొటో షాప్, ఆఫీస్ అప్లికేషన్స్, కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేషన్ తదితర అంశాల్లో 20 రోజులు పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు తమ ఆధార్, పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో ఈనెల 22వ తేదీలోగా వీఆర్ కాలనీ మొదటి లైన్‌లోని నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. nyces. in వెబ్‌సైట్‌లో సైతం రిజిస్టర్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 93968 61308ను సంప్రదించవచ్చని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు(అగ్రికల్చర్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి కర్నూలు సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. ఈ నెల 13న ఎర్రపోగు ధనురాజు(40) అనే వ్యక్తి బైక్‌పై వెళ్తూ బళ్లారి చౌరస్తాలో బైక్ పై వెళ్తూ ప్రమాదవశాత్తు అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించారు. అయితే కోలుకోలేక సోమవారం మరణించాడు. ఈ మేరకు మృతుని భార్య జానకి ఫిర్యాదు మేరకు 4వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు.

23న అన్నమాచార్యుల జయంతి

కర్నూలు కల్చరల్: గోదా గోకులంలో ఈనెల 23వ తేదీన తొలి తెలుగు వాగ్గేయకారుడు, పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త పేర్కొన్నారు. సోమవారం నగర శివారులోని గోదా గోకులంలో ఉత్సవాలకు సంబంధించిన బ్యానర్‌ను ప్రదర్శించి వేడుకల వివరాలను వెల్లడించారు. అన్నమయ్య ప్రాజెక్ట్ జిల్లా కళాకారులచే బృంద గానం, నగర సంకీర్తన, అన్నమయ్య హరికీర్తన చందనం, అన్నమయ్య చరిత్ర హరికథామృతం, అన్నమయ్య నృత్య నీరాజనం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో గోదా గోకులం సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాల సుధాకర్, వెంకట సుబ్రహ్మణ్యం, జనార్ధన్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి చెన్నకేశవస్వామి తిరునాల

ఓర్వకల్లు : మండలంలోని శకునాల గ్రామంలో ఈ నెల 22 నుంచి చెన్నకేశవ స్వామి తిరునాల నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 23న తెల్లవారు జామున 5.10 గంటలకు స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలకు కల్యాణ మూర్తుల గ్రామోత్సవం, సాయంత్రం 5 గంటలకు స్వాముల వారి రథోత్సవం ఉంటుందని చెప్పారు. 24న వసంతోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఆలయ నిర్మాణాలు పటిష్టంగా చేపట్టాలి

పాణ్యం: ఆలయాల్లో నిర్మాణాలు పటిష్టంగా చేపట్టాలని విజయవాడ దేవదాయ శాఖ ఇంజినీరింగ్ కార్యాలయ అధికారులు, సహాయ కమిషర్ జ్యోతి, ఈఈ గంగయ్య, ఏఈ ఉమాచౌదరి సూచించారు. సోమవారం మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో చేపడుతున్న ప్రత్యేక షెడ్లు, మహాప్రాకారం, విడిదిగదులు తదితర నిర్మాణాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ సీజీఎఫ్ నిధులు, భక్తుల సహకారంతో చేపడుతున్న నిర్మాణాలు పటిష్టంగా ఉండాలన్నారు. అలాగే ఆలయ చరిత్రను తెలియజేసేలా డిజైన్‌లు ఉండాలన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వైద్యులు ఉచిత వైద్య సేవలు అందించాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త మహా మంత్రి స్థాణుమాలయన్

కర్నూలు కల్చరల్: పేద, దళిత కాలనీల్లో హిందూ వైద్యులు అందరూ ఉచిత వైద్య సేవలు అందించాలని వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త మహా మంత్రి స్థాణుమాలయన్ అన్నారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సోమవారం మాడ్రన్ ఐ హాస్పిటల్స్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో 'హిందూ వైద్య బంధువుల సమావేశం' జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎవరికైనా ప్రాణం పోయగల సమర్థత కలిగిన ఏకైక సేవా వృత్తి వైద్యం మాత్రమే అన్నారు. ప్రస్తుతం వైద్యం చాలా ఖరీదు కావడంతో పేదలు, దళితులు నివసించే ప్రాంతాల్లో కనీసం నెలకు ఒక సారైనా ఉచితంగా వైద్యాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, సహ కార్యదర్శి ప్రాణేష్, కోశాధికారి సందడి మహేశ్వర్, జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, జిల్లా కార్యదర్శి భాను ప్రకాష్, సహ కార్యదర్శులు గిరిబాబు, గోవిందరాజులు, కోశాధికారి అయోధ్య శ్రీనివాసులు, మాడ్రన్ ఐ హాస్పిటల్ అధినేత రాజశేఖర్, ఆర్ఎస్ఎస్ కర్నూలు నగర సంఘ చాలక్ వాసురెడ్డి, ప్రఖండ సహ కార్యదర్శి ఉపేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు



వక్కెర వాగుపై వేగంగా జరుగుతున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు

కల్లూరు: మండల పరిధిలోని నెరవాడ గ్రామం వద్ద వక్కెర వాగుపై నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు వేగంగా జరుగుతున్నాయి. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వక్కెర వాగు పొంగి ప్రవహిస్తే గ్రామంలోని ప్రజలు కర్నూలు, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడేవారు. గ్రామస్తుల ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టింది. బ్రిడ్జి పూర్తయితే ఎంత భారీ వర్షం కురిసినా పాఠశాలలకు, ఇతర పనుల నిమిత్తం కర్నూలు వెళ్లేందుకు వీలవుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

25న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో ఈ నెల 25వ తేదీ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. వేసవి సెలవులను పురస్కరించుకొని బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆర్థిక సౌజన్యంతో నిర్వహిస్తున్న పోటీలలో గెలుపొందిన జట్లకు తొలి రెండు స్థానాలకు గానువరుసగా రూ.15 వేలు, రూ.8 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8639924149, 9010810756 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.